

నల్లకుంట డాక్టర్ చారి వీధిలో స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

నల్లకుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని డాక్టర్ చారి వీధి, ఫీవర్ ఆస్పత్రి మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లో సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత, డీఈ ప్రశాంతి, ఏఈఈ మనీషా, ఎంటమాలజీ అధికారులు అంబిక, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఫీవర్ ఆస్పత్రిలో మందులను అందుబాటులో ఉంచండి'

బర్కత్‌పుర, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను నియమించకపోవడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఓపీ భవనాన్ని పరిశీలించారు. ల్యాబ్ సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేయడం లేదన్నారు. డీఎంఈ డాక్టర్ వాణితో ఫోన్‌లో మాట్లాడి సూపరింటెండెంట్ నియామకంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆస్పత్రిలో అన్ని మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. ఆప్కో ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, గాంధీకుటీర్ పరిధిలో 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, చిక్కడపల్లి పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు, బర్కత్‌పుర పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, గోశాల, గగన్‌మహల్, తాళ్లబస్తీ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు పేర్కొన్నారు.

'విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి'

ముషీరాబాద్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి సూచించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మంగళవారం యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రేయిన్‌బో హోం అనాథ ఆశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం సభ్యులు

గురుకుల పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

ముషీరాబాద్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మహేష్ కోరారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల సమస్య, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బి. శంకర్‌రావు, కోశాధికారి స్వామి పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ పేరు పెట్టడం హర్షణీయం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ కళాశాలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడం హర్షణీయమని చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు అన్నారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలి కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటుచేసి రూ.2,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న కోనేరు సాయికుమార్

'ఎరుకల కార్పొరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేయండి'

బర్కత్‌పుర, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌కు తక్షణమే పాలకమండలిని ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని తెలంగాణ ఎరుకల (గిరిజన) హక్కుల ఐక్య పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించాలని, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు బి.సాయిలు, సలహాదారులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో ఇంటర్నేషనల్ అకడమిక్ కాన్ఫరెన్స్

పంజాగుట్ట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): స్టూడెంట్స్ ఇస్లాం ఆర్గనైజేషన్(ఎస్ఐఓ) ఆధ్వర్యంలో బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఈనెల 14, 15 తేదీల్లో ఇంటర్నేషనల్ అకడమిక్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని ఎస్ఐఓ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు పోస్టర్‌ను కన్వీనర్ అబ్దుల్ సలాం షాకీర్, హైదర్ ఖురేషితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ట్రేసింగ్ ట్రాజెక్టరీస్, రీఇమేజింగ్ ముస్లిం పాలిటిక్స్, స్టేట్ పాలిటిక్స్ అండ్ ఇండియన్ ముస్లిమ్స్ అనే అంశాలపై సదస్సులో చర్చిస్తామని అబ్దుల్ హఫీజ్ తెలిపారు.

రైలు ఎక్కబోతూ జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దీరజ్ కుమార్(40) తన స్వరాష్ట్రం బిహార్ వెళ్లేందుకు మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్లాట్ ఫారం నంబర్ 1లో ఎక్కాల్సిన రైలు కదులుతుండగా రైలు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పట్టాలపై పడిపోయాడు. రైలు అతడి రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చరీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే రాష్ట్రం ఏర్పాటు

కవాడిగూడ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు. వీరనారి చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని లోయర్ ట్యాంక్‌బండ్‌లో తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, కార్పొరేటర్ జి. రచనశ్రీ, తెలంగాణ రజయ అభివృద్ధి సంస్థ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మండలపు గాంధీ, గ్రేటర్ చైర్మన్ ఎం. నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు కొండమీది హరినాథ్, బొడ్డుపల్లి చుక్కయ్య, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శులు బి. చంద్రమోహన్, పొట్టిపోచల కిషన్, పెండ్యాల శ్రీధర్ తదితరులు ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం కొనసాగిందన్నారు. జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో..

చిక్కడపల్లి: తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ కెనరాబ్యాంక్‌వద్ద చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీజేఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు ఎం. నరసయ్య, ఉపాధ్యక్షులు జయపాల్‌రెడ్డి, జశ్వంత్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీజేఎస్ నాయకులు



లోయర్ ట్యాంక్‌బండ్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

బాగ్‌లింగంపల్లిలో..

రాంనగర్: బాగ్‌లింగంపల్లిలో ఐలమ్మ చిత్రపటానికి బీసీ రాజ్యాధికార సమితి చైర్మన్ దాసు సురేష్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

బాడీ బిల్డర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధం

ముషీరాబాద్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాడీ బిల్డర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. తెలంగాణ అమెచ్యూర్ బాడీ బిల్డర్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సయ్యద్ హకీం హుస్సేన్ క్లాసిక్ 2024 పేరిట 38వ మిస్టర్ అండ్ మిసెస్ సౌత్ ఇండియా సెలెక్షన్ ట్రయల్ ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముషీరాబాద్‌లోని ఆయేషా ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 200 మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. మొత్తం 15 కేటగిరీలలో పోటీలు జరిగాయి. ప్రథమ బహుమతి రూ. 5 వేలు, ద్వితీయ బహుమతి రూ. 3 వేలు, తృతీయ బహుమతికి రూ. 2 వేలు, మెడల్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, ఆల్ అహద్ ఎండీ అండ్ చైర్మన్ సయ్యద్ హకీం హుస్సేన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బాడీ బిల్డర్స్‌ను ప్రోత్సహించేందుకు సయ్యద్ హకీం ఈ పోటీలను నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్ హుస్సేన్ తెలంగాణ అమెచ్యూర్ బాడీ బిల్డర్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు బెన్ని ఫ్రాన్సిస్, ప్రధాన కార్యదర్శి ఎంఏ సలీం, కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ ఎజాజ్ హుస్సేన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతకు మెమెంటోను అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

కులగణనపై హైకోర్టు తీర్పు బీసీలకు శుభపరిణామం

రాంనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కులగణనపై హైకోర్టు తీర్పు బీసీలకు శుభపరిణామం అని తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. బీసీ కులగణన పూర్తిచేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం హర్షణీయమన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్‌గౌడ్

హర్షణీయం

మూడు నెలల కాల వ్యవధిలో బీసీ కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కులగణన చేయాలని హైకోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో బీసీ సంఘం నేతలు జిల్లపల్లి అంజి, వి. సతీష్, హేమంత్, బాలయ్య పాల్గొన్నారు.





అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేటలో పారిశుధ్య కార్మికులకు పుష్‌కార్ట్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి

పారిశుధ్య కార్మికులకు పుష్‌కార్ట్‌ల పంపిణీ

అంబర్‌పేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మంగళవారం పటేల్ నగర్‌లో పుష్‌కార్ట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇవి చెత్తను సులభంగా తీసుకెళ్లడానికి ఉపయోగపడతాయన్నారు.

బాగ్‌అంబర్‌పేటలో..

రాంనగర్: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో పారిశుధ్య కార్మికులకు చెత్త తరలించే పుష్‌కార్ట్‌లను కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య సూపర్‌వైజర్ నర్సింహ, ఆదిల్, అంజనేయులు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చెరువుల కబ్జాలను నివారించడానికి, ఆక్రమణలను తొలగించడానికి ఏర్పాటు చేసిన హైడ్రాపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆలిండియా జైహిందూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిరెడ్డి దశరథరాంరెడ్డి డిమాండ్ చేశారు. కబ్జాదారులకు వత్తాసు పలికిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా హైడ్రాను మరింత పటిష్ఠంగా అమలు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. కూల్చివేతల వల్ల నష్టపోయిన పేదలకు పునరావాసం కల్పించి, నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చెరువుల కబ్జాల ద్వారా లబ్ధిపొందిన వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని దశరథరాంరెడ్డి కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి దశరథరాంరెడ్డి



గవర్నర్‌కు పంపిస్తున్న పోస్టుకార్డులను చూపిస్తున్న విద్యార్థులు

వీసీలను నియమించాలని

గవర్నర్‌కు పోస్టు కార్డులు

తార్నాక, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియమించేందుకు చొరవ తీసుకోవాలని గవర్నర్‌కు విద్యార్థి సేన విన్నవించింది. మంగళవారం విద్యార్థులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణ నుంచి గవర్నర్‌కు పంపిస్తున్న పోస్టు కార్డులను చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు టీకే శివప్రసాద్ మాట్లాడుతూ.. వర్సిటీల్లో వైస్ చాన్స్‌లర్లు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు వీసీలను నియమించడంతో పాటు, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి వర్సిటీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు భాస్కర్, నరేంద్ర, శ్రీనివాస్, సాయితేజ, మోహన్ రెడ్డి, సంధ్య, సుజాత, శ్యామల పాల్గొన్నారు.

వైర్‌మన్ సూపర్‌వైజర్ పరీక్ష రాసే అభ్యర్థులకు

13 నుంచి ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): వైర్‌మన్, సూపర్‌వైజర్ పరీక్ష రాసే ప్రైవేట్ సెక్టార్ ఎలక్ట్రీషియన్లకు ఈనెల 13 నుంచి 23వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యులు నేమాల బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివరాలకు 7989349899, 9848258202 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రేపటి నుంచి

అక్కినేని, భానుమతి శతజయంతి మహోత్సవం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డుగ్రహీత డా. అక్కినేని నాగేశ్వరరావు, సినీనటి పద్మభూషణ్ డా. భానుమతీ రామకృష్ణ శతజయంతి మహోత్సవాలు ఈనెల 12 నుంచి 14 వరకు త్యాగరాయగాన సభలో నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా సినీనటీనటులు బాబుమోహన్, తనికెళ్ల భరణి, సురభి ప్రభావతిని సత్కరిస్తామని నిర్వాహకుడు డా. వంశీ రామరాజు తెలిపారు.

చాగంటి కోటేశ్వరరావుకు

ఆచార్య జీవీఎస్ సాహితీ పురస్కారం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ధృవం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాచస్పతి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు ఆచార్య జీవీఎస్ సాహితీ పురస్కారాన్ని, ఆచార్య సి.మృణాళినికి సుశీలాసుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి పురస్కార గ్రహీత చాగంటి కోటేశ్వరరావును సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, ముక్తేవి భారతి, వెంకట్ చంగవల్లి, జె.చెన్నయ్య సౌమ్య వారణాసి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.



చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న అతిథులు



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నాయకులు

బీజేపీ సభ్యత్వ నమోదు

నల్లకుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్ యాకర అమృత ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ ఎం. మధుసూదన్‌యాదవ్, అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం. శ్యామ్‌రాజ్, సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్‌కుమార్, డివిజన్ కన్వీనర్ కె. బి. నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పురలో..

బర్కత్‌పుర: కార్పొరేటర్ కన్నె ఉమాదేవి బర్కత్‌పుర చౌరస్తాలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సుభాష్‌పటేల్, క్షీరసాగర్, కృష్ణకుమార్, అరవింద్, నందకిషోర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిక

అంబర్‌పేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ జమీర్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు, కాంగ్రెస్ అంబర్‌పేట ఇన్‌చార్జి సి. రోహిణిరెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జమీర్ తిరిగి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్, అనిల్‌కుమార్, రావుల సుధాకర్ పాల్గొన్నారు.

'బ్రాహ్మణుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా'

నల్లకుంట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొచంపల్లి రమణారావు ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమను ఆమె నివాసంలో కలిశారు. బ్రాహ్మణుల సమస్యలను ఆమెకు విన్నవించారు. సమస్యలను సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని నీలిమ వారికి హామీ ఇచ్చారు.

నిథమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్)లో టూరిజం కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత కళాశాలగా కొనసాగుతున్న నిథమ్‌లో ఇంటర్ పాసైన విద్యార్థులు బీఎస్సీ, బీబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అడ్మిషన్లకు, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఎంబీఏ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుందని చెప్పారు. వివరాలకు 9553700034, 9553700035 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమంలో హిప్నో పద్మాకమలాకర్ తదితరులు

ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన

రాంనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని ముస్లిం మైనారిటీల గురుకుల పాఠశాలలో ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లయన్స్ క్లబ్‌ల సంయుక్తాధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. హిప్నో పద్మాకమలాకర్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె. వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారాల ప్రదానం

రాంనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కులాంతర, మతాంతర వివాహ దంపతులకు అభ్యుదయ ఆదర్శ దంపతుల పురస్కారం, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు గౌరవ సత్కారం నిర్వహిస్తున్నట్లు కుల నిర్మూలన సంఘం నేతలు డాక్టర్ సూర్యనారాయణ మాస్టర్, సూర్యసుధ, సూర్యతేజు సుభ్రాంత్ మంగళవారం తెలిపారు. ఆదర్శ వివాహం చేసుకుని 40 ఏళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పురస్కారాల ప్రదానం జరుగుతుందన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి. చంద్రయ్య హాజరవుతారని వారు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ ముంబాయిలో నివసిస్తున్న నాగనాథ్ నాందేవ్(37) క్యాటరింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో మనస్థాపానికి గురైన అతడు హైదరాబాద్ వచ్చాడు. మూడు రోజులపాటు కాచిగూడ రైల్వే స్టేషన్‌లోనే ఉన్నాడు. సోమవారం రాత్రి ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.